చేనేత కార్మికుల అభివృద్ధికి చేయూతనిస్తాం

అమరచింతలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న నాబార్డ్ సీజీఎం ఉదయ్‌భాస్కర్ సిబ్బంది

- నాబార్డ్ సీజీఎం ఉదయ్‌భాస్కర్

అమరచింత, మే 23: పట్టణంలోని చేనేత కార్మికులకు చీరల తయారీ, అలాగే డిజైనింగ్ రంగం, మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న అమరచింత స్కిల్స్ డెవలప్ మెంట్ అభివృద్ధికి నాబార్డ్ ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని నాబార్డ్ సీజీఎం ఉదయ్‌భాస్కర్, డీజీఎం సునీల్ దీప్తి, డీడీఎం మనోహర్‌రెడ్డి వెల్లడించారు. అమరచింత చేనేత ఉత్పత్తిదారుల భవనంలో శుక్రవారం అమరచింత చేనేత స్కిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రూలింగ్ సెంటర్‌ను నాబార్డ్ సీజీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన చేనేత కార్మికులు, టైలరింగ్ మహిళలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌తోపాటు, చేనేత కార్మికుల మగ్గాలను, మహిళల టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని, డీజీఎం , డీడీఎం, ఆర్డీఎస్ సీఈవో చిన్నమ్మ థామస్, స్కిల్స్ డెవలప్‌మెంట్ సీఈవో మహంకాళి చంద్రశేఖర్‌తో కలిసి తిలకించారు. ఈసందర్భంగా సీజీఎం ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు, టైలరింగ్ రంగంలో శిక్షణ పొందుతున్న మహిళలు నాబార్డ్ ద్వారా ఓఎఫ్‌పీవోకు అందించిన సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూ చించారు. అనంతరం సీజీఎంతో పాటు నాబార్డ్ సిబ్బందిని అమరచింత స్కిల్స్ డె వలప్‌మెంట్ సొసైటీ సీఈవో చంద్రశేఖర్‌తోపాటు సభ్యులు వెంకటస్వామి, అశోక్, జగదీశ్వర్ పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మహిళల టైలరింగ్ శిక్షకుడు సుధాకర్‌గౌడ్, చేనేత కార్మికులు, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నెట్టెంపాడు ఆయకట్టు రైతులను మోసం చేస్తున్న సీఎం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కుర్వ విజయ్‌కుమార్

గద్వాల,మే 23 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17నెలలు కావస్తున్నా నేటి వరకు జిల్లాలో ఉన్న నెట్టెంపాడు ప్రాజెక్టు 99.100 ప్యాకేజీ పనులను కనీసం మొదలు పెట్టకపోవడం దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కుర్వ విజయ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పాలమూరు జిల్లా నుంచి సీఎం అయితే జిల్లాకు పెద్దఎత్తున నిధులు వచ్చి కృష్ణ జలాలు పారించి జిల్లా రైతులకు న్యాయం చేస్తాడని అనుకుంటే ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఒక్కో ఎకరానికి రూ.10లక్షలు ఇచ్చినా 480ఎకరాలుకు కనీసం రూ.50 వేల కోట్లు భూ సేకరణకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. భూసేకరణ పూర్తి కాకుండానే కాల్వలు ఎలా తవ్వుతారని ప్రశ్నించారు. దీనికి రైతులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే నెట్టెంపాడు పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేసి, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ముగిసిన షా-అలీ పహిల్వాన్ ఉర్సు

అంగళ్ల వద్ద వస్తువులు కొనుగోళ్లు చేస్తున్న మహిళలు

అలంపూర్,మే 23 : షా-అలీ పహిల్వాన్ ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు (చివరి రోజు) శుక్రవారం పెద్ద దర్గా వద్ద మహిళ ఉర్సు నిర్వహించారు. భక్తులు వారి మొక్కుబడి ప్రకారం ప్రసాదాన్ని తీసుకొచ్చి దర్గాలో సమర్పించుకున్నారు. భక్తులు ముందుగానే రాతి పడవలో ఉంచిన ప్రసాదాన్ని చుట్టు చేరిన మహిళ భక్తులపై విసిరివేశారు. ఎక్కడా లేని విధంగా అలంపూర్ ఉర్సు ఉత్సవాల్లో కేవలం మహిళలకే ఉర్సు నిర్వహించడం ప్రత్యేకత అని ఉర్సు నిర్వాహకులు, ఉర్సు ఉత్సవ కమిటీ చైర్మన్ అహ్మద్ ఓవైస్, షఫి అహ్మద్, రుక్కు పేర్కొన్నారు. దర్గా పరిసరాల్లో పురుషులకు అనుమతులు లేకుండా మహిళా పోలీసులే భద్రతా చర్యలు చేపట్టారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఉర్సులో వెలిసిన గాజుల అంగళ్ల వద్ద ఆడపడచులకు వారి బంధువులు గాజులు వేయించారు. తాసీల్దార్ మంజుల ఉర్సులో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిబద్ధతతో పనిచేసినప్పడే గుర్తింపు

డిప్ ద్వారా స్వీపర్లను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్

గద్వాలటౌన్, మే 23 : చేసే పని నిబద్ధతతో చేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు. జి ల్లా కేంద్రంలో ని కలెక్టరేట్‌లో స్వీపర్ పో స్టుల భర్తీ కోసం లాటరీ విధానంతో ఎంపిక చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ స్వీపర్ పోస్టులకు మొత్తం 54మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సీ కోటలో ఒకరిని, జనరల్ మహిళా కేటగిరిలో ఒకరిని, జనరల్ కేటగిరిలో మరొకరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారు స్వీపర్ కం నర్సింగ్ ఆయూస్ హోమియోపతిలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సిద్ధప్ప, ఉపాధి కల్పన అధికారి ప్రియాంక పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు

మాట్లాడుతున్న జడ్జి కళార్చన

వనపర్తి టౌన్, మే 23 : జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు జడ్జి కళార్చన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పొగాకు వాడడం వల్ల వచ్చే అనార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో పొగాకు వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞను నిర్వహించారు. అదేవిధంగా బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా చట్టం, మహిళ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, డ్రగ్స్, మత్తు పదార్థాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఉత్తరయ్య, జీహెచ్‌ంలు కొం డాజ్యోతి, ప్రతాప్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, లీగల్ వలంటీర్లు రవీందర్, సురే శ్, దయాకర్, వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులు, హెచ్‌వోడీలు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మే 23 : వైద్యులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెడ్‌లు ప్రభుత్వ దవాఖానలో అందుబాటులో ఉండాలని అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, దవాఖాన సూపరింటెండెంట్లు, హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో హెచ్‌వోడీలు అందుబాటులో లేకపోతే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించలేమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇక నుంచి బయోమెట్రిక్‌తోపాటు మ్యానువల్ హాజరు రిజిస్టర్ ప్రతి నెలా తనకు పంపించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ దవాఖాన, మాతా శిశు సంరక్షణ దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. దవాఖానలో మౌలిక సదుపాయాలపై చర్చిస్తూ రోగులకు అవసరమైన వీల్ చైర్లు, కూర్చోవడానికి బెంచీలు మరిన్ని కొనుగోలు చేసేలా ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ప్రతి నెలా 400 ప్రసవాలు ప్రభుత్వ దవాఖానలో జరిగేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలో కంటి ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చినందున జిల్లాలో కంటి పొరలతో ఇబ్బందులు పడుతున్న వారికి శస్త్రచికిత్సల ద్వారా వైద్యం చేయాలని ఆదేశించారు. ఈ విషయమై పీహెచ్‌సీల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో చెవి, ముక్కు, గొంతు నొప్పి వ్యాధులతో బాధపడే వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ దవాఖానలో ఈఎన్‌టీ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీఎస్ఎం ఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల ను ఆదేశించారు. అదేవిధంగా మాతా శిశు వైద్య కేంద్రం వద్ద నిర్మిస్తున్న కేర్ యూనిట్‌ను త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ రంగరావు, డిపార్ట్‌మెంటల్ హెడ్స్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత దిశగా బోధన సాగాలి

వనపర్తి టౌన్, మే 23 : వనపర్తి జిల్లాలో పదో తరగతిలో ఉత్తీర్ణత దిశగా బోధన జరగాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి సబ్జెక్టుల్లో ప్రావీణ్యత మెరుగుపర్చుకునేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పిల్లలకు లెక్కలు సులువుగా అర్థమయ్యేలా మాస్టర్ బోధిస్తుండగా కలెక్టర్ కూడా ఉపాధ్యాయులతో కూర్చొని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని బాధ్యతగా తీసుకోవాలన్నారు. పదో తరగతిలో విద్యార్థి ఫెయిలైతే ఉపాధ్యాయులు ఫెయిలైనట్లేనని భావించాలన్నారు. వనపర్తి జిల్లాలో గణితంలో విద్యార్థులు ఫెయిలవుతున్నారని, మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులతో పోల్చుకుంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు చాలా ఉత్తమంగా ఉంటారనడంలో సందేహం లేదన్నారు. అందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థుల కు బోధించడమేనని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘనీ, సెక్టోరియల్ అధికారి మహానంది తదితరులు ఉన్నారు.

డ్రై డే ఫ్రైడేలో భాగంగా వార్డులో పారిశుధ్య చర్యలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజలకు అవగాహన కల్పించాలి

పరిసరాల్లో దోమలు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆ దర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని నాగవరం, ఇందిరాకాలనీ, 5, 10 వార్డుల్లో మున్సిపల్ వైద్యారోగ్య శాఖ ద్వారా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. వర్షపు నీరు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పడవేసిన సీసా మూతల్లో నిలిచిన నీటిలో డెంగీ దోమలు గు డ్లు పెట్టి పెరుగుతాయని, అందువల్ల ఇండ్ల కప్పుపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతోపాటు శుక్రవారం ప్రజలు ఇండ్లలో నీరు పారబోసేలా అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లలో ఎవరికైనా జ్వరం, జలుబు, గొంతునొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్యారోగ్య పరీక్షలు చేయించాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. వారంరోజుల్లో వర్షకాలంలో ప్రారంభవుతుందని, దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు దోమల వల్ల వస్తాయని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. వార్డుల్లో పర్యటిస్తూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎలా అవగాహన క ల్పిస్తారని ఆశ కార్యకర్తలను ఆరాతీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమళ, ఆశవర్కర్లు ఉన్నారు.

ధాన్యం కేంద్రాల్లో దోపిడీకి గురవుతున్న రైతులు

- బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య
- సింధనూర్ ఐకేపీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

అయిజ, మే 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించి ధాన్యం విక్రయిద్దామని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తే ఐకేపీ నిర్వాహకులు రైతుల వద్ద నుంచి తరుగు పేరుతో ధాన్యం అదనంగా సేకరించి రైతులను మరింత కష్టాల్లోకి నెడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం అయిజ మండలంలోని సింధనూర్ ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని ఆయన పరిశీలించి, రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. క్వింటాకు రెండు కేజీల వరి ధాన్యం తీసుకునేందుకు అనుమతిస్తేనే ధాన్యం కొంటామని, లేకపోతే ఎక్కడైనా అమ్ముకోండని, ఎవరికైనా చెప్పుకోండని రైతులను నిర్వాహకులు బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని పల్లయ్య తెలిపారు. జిల్లాలోని 69 కేంద్రాల్లోని రైతులు దోపిడీకి గురవుతున్నారని కలెక్టర్, అదనపు కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా ఐకేపీ నిర్వాహకుల తీరు మారడంలేదని ఆయన దుయ్యబట్టారు. ఐకేపీ కేంద్రాల నిర్వాహకుల దోపిడీకి అంతులేకుండా పోతుందన్నారు. రైతులను మోసం చేసినోడు చరిత్రలో బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు. సకాలంలో గన్నీ బ్యాగులు అందక, కాంటా పట్టకుండా, మిల్లుల కు తరలించకుండా, వరి ధాన్యం అకాల వానలకు తడిసి తీ వ్రంగా నష్టపోవడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన రెండేళ్లలోనే రైతులను నిట్టనిలువునా మోసం చేస్తుందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా ఎగ్గొట్టి మోసం చేస్తున్న రేవంత్ సర్కారు ఎంతో మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల్లో దోపిడీ చేస్తున్న ఐకేపీ కేంద్రాల నిర్వాహకులతోపాటు సింధనూర్ ఐకేపీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సింధనూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు

పాన్‌గల్, మే 23 : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు తప్పడంలేదని బీఆర్ఎస్ మండల నాయకుడు పెబ్బేటి వీరసాగర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి ధాన్యం పండిస్తే కొనుగోలు విషయంలో ప్రభుత్వ అసమర్థతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరికొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నిరీక్షణ తప్పడంలేదని, వారి ఆశలు ఆడియాసలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు వడ్లు తడిసి నష్టపోతున్నా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ధాన్యం తడిచి ముద్దయి మొలకలు వస్తున్నాయని, కాంగ్రెస్ నాయకులకు, మంత్రులు, ఎమ్మెల్యేలకు రైతుల కష్టాల తెలియడంలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే కమీషన్లు అని ఆరోపించారు. ప్రజాపాలన అంటేనే ఇదేనా? ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రజారైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడా పనికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉపాధి హామీని నిర్లక్ష్యం చేయొద్దు

మదనాపురం, మే 23 : ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కుదించాలని చూస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ అధికాంలోకి వచ్చిన పదకొండు ఏండ్లలో ప్రతి ఏడాది బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయిస్తూ కూలీలను పనికి దూరం చేస్తున్నాడన్నారు. దేశంలో 40శాతం ఉన్న వ్యవసాయ కూలీలకు రూ.2 లక్షల కోట్లు అవసరం అవుతాయని కానీ మోదీ ప్రభుత్వం రూ.83 వేల కోట్లు మాత్రమే కేటాయించి కూలీలను పనిలేకుండా చేస్తున్నాడని విచారం వ్యక్తం చేశాడు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూలీలు తిరగబడాలని, పెండింగ్ కూలి డబ్బులు, తదితర సమస్యలపై ఈనెల 30వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ప్రసాద్, కూలీలు పాల్గొన్నారు.

ఖనిజ సంపద దోపిడీ కోసమే బూటకపు ఎన్‌కౌంటర్లు

అమరచింత, మే 23: దేశంలో ఉన్న ఖనిజ సంపదను పీఎం మోదీ, హోం మంత్రి అమిత్‌షా అష్టమిత్రులకు దోచిపెట్టడం కోసమే ఆడవుల్లో ఉన్న ఆదివాసిలను ఖాళీ చేయించేందుకు పథకం ప్రకారమే ఆపరేషన్ కంగార్ పేరిట మావోస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ వనపర్తి జిల్లా కార్యదర్శి హన్మంతు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, మండల కార్యదర్శి రాజన్న తదితరులు శుక్రవారం ప్రకటనలో ఆరోపించారు. ఆపరేషన్ కంగార్ పేరిట నరమేధానికి పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం ఆరునెలల కిందట ప్రణాళిక సిద్ధం చేసుకున్నదని, అందులో భాగంగానే 2026 మార్చి 31వ తేదీ లోగా మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయాలని నిర్ణయం తీసుకుందని వారు ఆరోపించారు. మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినా బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడడం అమానుషచర్య అని అన్నారు. తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని మావోయిస్టులతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు.

మొబైల్ ఫోన్లు రికవరీ

అలంపూర్ చౌరస్తా, మే 23 : దొంగలించబడిన, మిస్సింగ్ అయిన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీతో రికవరీ చేస్తున్నామని ఎస్సై మహేశ్ అన్నారు. శుక్రవారం ఉండవెల్లి మండల కేంద్రంలో మిస్సింగ్ అయిన ఫోన్లను పోలీస్ స్టేషన్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చిన వారికి సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా 6మొబైల్ ఫోన్లను గుర్తించామని వీటి విలువ రూ.80 వేలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది హుస్సేన్, వెంకట్‌గౌడ్, అబ్దుల్ గఫూర్, నగేశ్, హుస్సేన్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్, మే 23 : అకాల వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు ఇబ్బందులు కలుగకుండా సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులను అదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి సంబంధించిన వివరాలు అధికారుల నుంచి తెలుసుకొని అవసరమైన సూచనలను చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు తుదిదశకు చేరిందన్నారు. వర్షాల ప్రభావంతో తేమ శాతం పెరుగుతున్న నేపథ్యంలో ధాన్యాన్ని వారం రోజులలోగా మిల్లులకు తరలించాలని అదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు ఉండకూడదని, వాటిని వెంటనే క్లియర్ చేయాలన్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే టోకెన్ల జారీ చేయాలని వ్యవసాయ అధికారులను అదేశించారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఏపీఎం తమ అవసరానికి అనుగుణంగా వాటిని తీసుకొని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మిల్లర్లతో సమన్వయం చేసి ధాన్యాన్ని వెంటనే మిల్లుల వద్ద దించేందుకు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల అధికారికి తెలిపారు. కేంద్రంలో ఉన్న ధాన్యపు పరిమాణానికి అనుగుణంగా లారీలను పంపించాలని పౌరసరఫరాల జిల్లా మేనేజర్‌కు సూచించారు. కేంద్రాల నుంచి నివేదికలు పూర్తిగా స్పష్టంగా అందజేయాలన్నారు. ట్రక్ షీట్ వచ్చిన వెంటనే ఓపీఎంఎస్‌లో డేటా ఎంట్రీ చేసి రైతులకు వెంటనే నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అధికారులు స్వామి కుమార్, విమల, పుష్పమ్మ, సక్రియానాయక్, శ్రీనివాసులు, నర్సింహులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాసిరకంగా బాక్స్ కల్వర్టుల నిర్మాణం

- ఏఈ లేకుండా పనులు చేపట్టిన కాంట్రాక్టర్
- కమిషనర్ ఆదేశాలతో నిలుపుదల

అయిజ, మే 23 : అయిజ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో బాక్స్ కల్వర్టుల నిర్మాణాలను నాసిరకంగా చేపడుతున్నారు. మున్సిపల్ ఏఈ పర్యవేక్షణలో నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా, మున్సిపల్ ఏఈ సస్పెండ్ అయిన విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రోడ్డు మార్గం లేకపోవడంతో బాక్స్ కల్వర్టులు రెండు చేపట్టాలని కలెక్టర్ నిర్ణయం తీసుకొని పనులు సకాలంలో పూర్తి చేసి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కలెక్టర్ ప్రత్యేక నిధులు రూ. 20 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మార్కెట్‌లోకి సులువుగా వెళ్లేందుకు బాక్స్ కల్వర్టు పనులు చేపట్టారు. ఇప్పటికే ఒకటి పూర్తి చేసిన కాంట్రాక్టర్ రెండో కల్వర్టును పూర్తి చేసేందుకు సిద్ధమై శుక్రవారం నాసిరకంగా పనులు చేపడుతున్నారు. అక్కడే ఉన్న కొందరు పట్టణ ప్రజలు కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపడు తున్నారని ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వెంటనే కమిషనర్ సైదయ్య పనులు నిలిపి వేయించాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారు. ఎన్నో ఏండ్లుగా మన్నికతో ఉండాల్సిన పనులు ఇంజినీరింగ్ పనులు అధికారుల అలసత్వంతో పనులు నాసిరకంగా చేపడుతుండటంతో పట్టణ ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. నిబంధనల అనుసరించి పనులు చేయించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

జ్ఞానదర్శిని సమన్వయకర్తకు సన్మానం

వనపర్తి టౌన్, మే 23: ఇటీవల ఎల్లూరు గ్రామంలో 70 ఏండ్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా గ్రామ చరిత్ర, బడి, గుడి, సంస్కృతి సంప్రదాయలపై జ్ఞానదర్శిని సంచికను రూ పొందించిన సమన్వయకర్త కంటె నిరంజనయ్యను శుక్రవారం ఉపాధ్యాయ శిక్షణలో సన్మానించారు. ఈ సందర్భంగా సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం ఉమాదేవి మాట్లాడుతూ పాఠశాల ప్లాటీనం జూబ్లీ సంచికను తీసుకురావడంలో కృషి చేసిన తెలుగు భాషా ఉపాధ్యాయులు కంటె నిరంజనయ్య పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల ప్రగతిలో పూర్వ విద్యార్థులు అందించిన చేయూత, సంస్కృతి సంప్రదాయాలను ఈ శిక్షణ ద్వారా పా